www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 07 | జూన్ | 2025
పేజీలు : 8

## నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మదన్‌లాల్




-మదన్‌లాల్ సేవలు మరువలేనివి
-వైరాలో మదన్‌లాల్ సంతాప సభ
-పాల్గొన్న కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల
-కంటతడి పెట్టిన నాయకులు
-మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

8 లో

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సరీలు



-అనుమతులు లేని నర్సరీలు
-పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ

**ప్రజాపక్షం/ఖమ్మం :** మారిన పరిస్థితుల్లో ప్రతి యేటా విత్తన కొనుగోలు చేయక తప్పని స్థితి రైతులకు ఏర్పడింది. గతంలో రైతులే తాము పండించిన పంటల నుంచి విత్తనాలు తయారు చేసుకునే వారు. ఇప్పుడు ఒకసారి సాగు చేసిన పంట నుంచి విత్తనాలు తయారు చేసే పరిస్థితి లేకపోవడం, హైబ్రీడ్ విత్తన వాడకం కారణంగా ప్రతి యేటా విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలోనే మిర్చి సాగు చేసే జిల్లాల్లో మొదటి వరుసలో ఉండే ఉమ్మడి ఖమ్మంజిల్లాలో మిర్చి నర్సరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రైతాంగం ఒకప్పుడు విత్తనాలు విత్తి సాలు తోటలను సాగు చేసే వారు. కానీ ఇప్పుడు మిర్చినారు నాటే పద్ధతికి అలవాటుపడ్డారు. దీనిని సొమ్ము చేసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం లోనూ నర్సరీలను ఏర్పాటు

మిగతా 2లో..

# కూనంనేని కృషితో కొత్తగూడానికి మరో మణిహారం

- ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు
- ప్రపంచ స్థాయిలో మార్మోగనున్న భద్రాద్రి జిల్లా ఖ్యాతి
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కూనంనేని, తుమ్మల



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు కృషితో కొత్తగూడెంకు మరో మణిహారం రాబోతోంది. నియోజకవర్గంలో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వ హించే కమ్యూనిస్టు నాయకునిగా ప్రజలకు కావాల్సి అవసరాలతో పాటు భావితరాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన ఉన్న ఆయన ఎంఎల్‌ఎగా గెలుపొందిన నాటి నుండి ఇప్పటికే కొత్తగూడెం నియోజకవర్గాన్ని అంచలంచెలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇందు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున సహాయసహకారాలు ఉండటంతో పాటు ముగ్గురు మంత్రులైన మల్లుభట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఉమ్మడి జిల్లా వాసులు కావడం మరింతగా కలిసొస్తోంది. ఇదిలాగా ఉండగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా ఇంచార్జ మంత్రిగా ఉండటంతో మంత్రులకు కూనంనేనికి ఉన్న సత్సంబంధాలు అభివృద్ధికి బాటలేస్తున్నాయి. గురువారం జరిగిన క్యాబినేట్ సమావేశంలో కొత్తగూడెం కేంద్రంగా ఎర్త్‌సై న్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఉమ్మడి జిల్లా వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఏర్పాటు చేయబోయే ఎర్త్ యూని వర్సిటీకి మాజీ భారతప్రధాని డా.మన్మో హన్ సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించారు.

మిగతా 2లో..

# పేదోడి గుండెకు ప్రభుత్వ భరోసా

-విజయవంతంగా కొనసాగుతున్న క్యాథ్‌ల్యాబ్ సేవలు




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** పేదోడి వైద్యానికి భరోసాగా నిలుస్తుంది ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాథ్‌ల్యాబ్. నిరంతరాయంగా సేవలను పైసా ఖర్చు లేకుండా రోగులకు అందిస్తున్నారు. అత్యాధునీక వైద్యం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అందించడం అభినందనీయం. 2022లో నాటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ప్రారంభమైన క్యాథ్‌ల్యాబ్ సేవలు మరింత మెరుగుపడి ఇప్పుడు గుండె జబ్బుల బారీనపడిన వారికి భరోసాగా నిలుస్తుంది. ఇప్పటికే ఆసుపత్రిలో న్యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి రోగులు ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా సేవలు పొందుతున్నారు. యాంజియోగ్రామ్ పరీక్షలు వేలాది మందికి నిర్వహించగా వందలాది మందికి గుండెకు సంబంధించిన స్టంట్లు వేశారు. గుండె నొప్పి సంబంధిత వ్యాధితో వచ్చే వారిని ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేయకుండా ఇక్కడే పూర్తి స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ఆసుపత్రిలో కార్డియాక్, ఎమర్జెన్సీ, ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేసి రూ. 10 కోట్లతో అత్యాధునీక పరికరాలను సమకూర్చారు. స్టంట్ వేయడం, గుండెను పరీక్షించడం, పేస్‌మేకర్ చికిత్సలు అందించడం చేస్తున్నారు. గుండె సంబంధిత వైద్య సాయం

మిగతా 2లో..

# త్యాగానికి ప్రతీక బక్రీద్





**ప్రజాపక్షం/కామేపల్లి:** ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ బక్రీద్, దీనినే ఈదుల్ జుహా, ఈదుల్ అదా అని కూడా అంటారు. బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని, ముస్లిం సోదరులు వేకువజామున లేచి ఫజరు నమాజ్ చదివి అనంతరం ఉదయం 9గంటల లోపు ఈద్గాలు, మసీదులలో బక్రీద్ పండుగ ప్రత్యేక నమాజులు చేస్తారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఆర్థిక స్తోమత కలిగిన ముస్లిం సోదరులు వివిధ రకాల జంతువులను వధించి ఖుర్బానీ మాంసాన్ని, బంధువులకు, గ్రామాల్లోని తోటి ముస్లీం సోదరులకు పంచి పెడతారు. ఈ విధంగా పండుగ రోజు నుండి మూడు రోజుల పాటు జంతువులు మాంసాన్ని పంచి పెడుతూ ఉంటారు. ఇదే నెలలో మక్కాలో ప్రతి సంవత్సరం హజ్ యాత్ర జరుగుతూ ఉంటుంది. ఈ హజ్ యాత్రలో ప్రపంచ దేశాల నుండి లక్షలాది మంది ముస్లిం సోదరులు, సోదరిమణులు హజ్ యాత్ర చేస్తూ ఉంటారు. త్యాగానికి, దానానికి నిదర్శనంగా ఈ పండుగను, ప్రపంచంలోని ముస్లింలు జరుపుకుంటారు.

**-బక్రీదు పండుగా ఎలా అవతరించింది...**

హాజరత్ ఇబ్రహీం ప్రవక్త, హాజీర దంపతులు ఎన్నో పూజలు, దాన ధర్మాలు, త్యాగాల ఫలితంగా 80 ఏళ్ల వయస్సులో లేక లేక

మిగతా 2లో..

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సరీలు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. నర్సరీల కోసం ఖచ్చితంగా వ్యవసాయ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి తీసుకున్న తర్వాత ఏఏ రకం విత్తనాలను నర్సరీలో పెంచుతున్నారు, వాటి వివరాలు అది వ్యవసాయ అధికారులకు అందించాల్సి ఉంటుంది. ఒకవేళ నర్సరీలో కొనుగోలు చేసిన రైతు విత్తనాల కారణంగా నష్టపోతే పరిహారం అందించాల్సిన బాధ్యత కూడా నర్సరీ నిర్వాహకులపైనే ఉంటుంది. కానీ జిల్లాలో అనుమతులు లేని నర్సరీలే ఎక్కువగా ఉన్నాయి. ఒకచోట అనుమతి తీసుకోవడం మరో చోట నర్సరీని ఏర్పాటు చేస్తున్న వారు కూడా అనేక మంది ఉన్నారు. ప్రతి యేటా నర్సరీల నుంచి లెక్కకు రాని ఆదాయం వ్యవసాయ శాఖాధికారులకు అందుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఐదేండ్ల కాలంలో నర్సరీలలో విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన వారు చాలా మంది ఉన్నారు. కల్తీ విత్తనాలపై దృష్టిసారించిన ప్రభుత్వం నర్సరీలపై కూడా దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మిర్చికి సంబంధించి రైతులు విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసే పరిస్థితి లేనందున నర్సరీలపై దృష్టి సారించి కల్తీ విత్తనాలు నర్సరీలలో వినియోగించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అనుమతి పొందిన నర్సరీలు మినహా మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటే కొంత మేర సత్ఫలితాన్ని ఇవ్వవచ్చు. ఏ నర్సరీలో ఏ రకం విత్తనాలను నాటారో కూడా అధికారులు రికార్డుల్లో పొందుపర్చాల్సి ఉంటుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా వ్యవసాయ అధికారులు ముందే చర్యలు తీసుకుంటే రైతులను కల్తీ భారీన పడకుండా కాపాడవచ్చు.

# కూనంనేని కృషితో కొత్తగూడానికి మరో మణిహారం

(మొదటిపేజీ తరువాయి)

**అమెరికా తర్వాత ఇక్కడే...**

ఎర్త్ సైన్స్ యూవివర్సిటీ అమెరికా దేశంలో మాత్రమే ఉంది. ఇప్పుడు తెలంగాణలోని కొత్తగూడెం నియోజవర్గంలో ఏర్పాటు చేయనుండటంతో దేశంలోనే రెండో విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందనుంది. సుమారు 300 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ యూనివర్సిటీతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభిస్తుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మంది విద్యా ఉపాధి అవకాశాలకు మార్గం సుగుమమైంది. పెద్దఎత్తున యువశాస్త్రవేత్తలు ఇక్కడి నుండే దేశభవిష్యత్‌కు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్రపోషించనున్నాయి.

**యూనివర్సిటీ అందించనున్న కోర్సులు ఇవే...**

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ఏర్పాటు చేయ తలపెట్టిన ఎర్త్ యూనివర్సిటీలో పలు రకాల కోర్సులను ప్రవశపెట్టేందుకు కూడా క్యాబినేట్‌లో నిర్ణయం జరిగింది. యుజి బిఎస్‌ఇ ప్రోగ్రాంలో జియాలజీ, ఎన్విరానమెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రి,. పిజి ఎంఎస్‌సి ప్రోగ్రాంలో జియోలజీ, ఎన్విరానమెంట్ సైన్స్, జియో ఫిజిక్స్, కెమిస్ట్రి,. పిహెచ్‌డి ప్రోగ్రాంలో యూజిసి నిబంధనల ప్రకారం కోర్సులను అందించడంతో పాటు ఇప్పటికే బిటెక్ ప్రోగ్రామ్‌లో ఉన్న మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోని ప్రతీ కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లతో కోర్సులు అందిస్తారు.

**యువతకు ఉద్యోగ అవకాశాలు...**

మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మంజూరు చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అపాధి అవకాశాలు లభించనున్నాయి. వేలాదిమంది ఉన్నత చదువులకు కొత్తగూడెం కేంద్రం బిందువు కానుంది. అనేకమంది శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దబడబోతున్నారు. సింగరేణి గనులతో పాటు పలు సహజన వనరులున్న ఈ జిల్లాకు మరో మణిహారంతో కొత్తగూడెం ఖ్యాతి ప్రపంచ పటంలో మురయనుంది.

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కూనంనేని...**

కొత్తగూడెం నియోజకర్గంలో ఎర్త్‌యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డికి, మంత్రులకు, సహకరించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**పట్టువీడని విక్రమార్కుడు కూనంనేని...**

కొత్తగూడెం ఎంఎల్‌ఏగా గెలిచిన కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాభివృద్ధికి పట్టువిడువని విక్రమార్కునిగా మారారు. నియోజకర్గ ముఖ చిత్రంపై పూర్తి పట్టున్న ఆయన ఇక్కడి సహజ వనరులు, భౌగోళిక పరిస్థితులు, నైసర్గికస్వరూపం, పరిశ్రమలు, విభిన్న ప్రజలు, వారి జీవనశైలి,ఆహారపు అలవాట్లు, అభిరుచులు,కట్టుబాట్లపై పూర్తి పట్టున్న ఆయన నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి గెలిచిన మరుక్షణం నుండి ఆలోచించడం మొదలుపెట్టారు. అధికారులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. పారిశ్రామికంగా ఎంతో ప్రగతి ఉన్న ఈప్రాంతం మరింత ముందుకు పోవాలంటే ఏం చేయాలో ఆలచన చేసి నివేదికలు తయారు చేయించి ప్రభుత్వ పెద్దలను కలిసి ఫైళ్లు కదిలించి ముఖ్యమంత్రి, మంత్రిమండల సహాకారంతో పెద్ద ఎత్తున నిధులు తెప్పిస్తున్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

(మొదటిపేజీ తరువాయి)



కుమారుడు జన్మిస్తాడు, ఆ కుమారుడికి ఇస్మాయిల్ అలైహి సలాం అని నామకరణం చేస్తారు. ఇలా వారి జీవితం సాఫీగా సాగుతుంది. ఒక రోజు దైవ ప్రవక్త అయినా ఇబ్రహీం ప్రవక్తకు కలలో అల్లాహ్ ఈ విధంగా ఆజ్ఞాపించారు. నీవు ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నానీ కుమారుడైన ఇస్మాయిల్ అలై సలాంను బలి ఇవ్వాలని కోరుతాడు. ప్రభువా మీ ఆజ్ఞని నేను శిరసా వహిస్తా అని ఇబ్రహీం ప్రవక్త అల్లాహ్‌కు మాట ఇస్తారు. చెప్పాడు, అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు. నీవు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్నా, నీ కుమారుడైన ఇస్మాయిల్ అలైహి సలాంను నాకు బలిగా ఇవ్వాలని కోరుతాడు. అల్లా ఆజ్ఞను ఇబ్రహీం అలైహి సలాం ప్రవక్త తన భార్య హాజీరాకు ఈ విషయాన్ని తెలియజేస్తాడు తెలియజేస్తాడు. అప్పుడు ఆమె అల్లాఃనే ఈ విధంగా కోరినప్పుడు, మనకు ఆయన కంటే ఎక్కువ ఎవరిని అల్లాహ్ ఆజ్ఞను మనం పాటించాల్సిందిగా కోరుతుంది. అల్లా ఆజ్ఞ ప్రకారం ఇబ్రహీం అలైహి సలాం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్ అలైహి సలాంను అడవిలోనికి తీసుకెళ్లి అల్లా ఆజ్ఞా ప్రకారం మాట తప్పకుండా తన కుమారుడైన ఇస్మాయిల్ అలైహి సలాంను పడుకోబెట్టి కుమారుడి బలి దానం చేసి మాట తప్పుతానేమోనని తన కళ్ళకు నల్లటి గుడ్డను కట్టుకొని, కుమారుడి మెడపై కత్తి సవారి చేస్తుండగా, ఇబ్రహీం ప్రవక్త త్యాగానికి మెచ్చి అల్లాహ్, స్వర్గము నుండి ఒక పొట్టేలును ఇస్మాయిల్ స్థానములో పంపిస్తాడు. అప్పుడు ఇస్మాయిల్ పక్కకు నెట్టబడి ఆయన స్థానములో స్వర్గం నుండి అల్లాహ్ పంపించిన పొట్టేలు జుబహ్, హలాల్ కాబడుతుంది. అప్పటి నుండి ఇబ్రహీం ప్రవక్త చేసిన త్యాగానికి నిదర్శంగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలందరూ ఈ బక్రీద్ పండుగను చేసుకుంటారు. ఇబ్రహీం ప్రవక్త దంపతుల, త్యాగమే బక్రీద్ పండుగ సారాంశం.

**ఖుర్బాని ఇలా.....**

హాజరల్ ఇబ్రహీం ప్రవక్త చేసిన త్యాగానికి నిదర్శంగా స్తోమత కలిగిన ముస్లింలందరూ బక్రీదు పండుగ రోజు నుండి మూడు రోజుల పాటు వివిధ రకాల జంతువులను కోసి ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం దానం చేసే వాళ్ళకి, రెండ భాగం బంధువులకు, మూడువ భాగాన్ని గ్రామంలోని తోటి ముస్లిములకు పంచి పెడతారు. దీనినే ఖుర్బాని అంటారు.

# పేదోడి గుండెకు ప్రభుత్వ భరోసా



(మొదటిపేజీ తరువాయి)

పొందేందుకు లక్షల్లో బిల్లులు చెల్లించలేక గుండె జబ్బులతో బాధపడుతున్న వారికి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వరంగా మారింది.

**ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నాం : సూపరింటెండెంట్**



క్యాథ్‌ల్యాబ్, యాంజియోగ్రామ్ సేవలను ఉచితంగా అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రతి రోగిని పూర్తి ఆరోగ్య వంతునిగా మార్చుతున్నామని సుదూర ప్రాంతాలకు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని రోగి ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి డిశ్చార్జ్ అయ్యేంత వరకు ఆ తర్వాత కూడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1240 కరోనరీ యాంజియోగ్రామ్స్, 1190 స్టంట్స్, 20పేస్‌మేకర్స్, 18 రీనల్ యాంజియోగ్రామ్స్, పెరికార్డియల్ వైద్య సేవలు 15, పెరిపెరల్ యాంజియోగ్రామ్ ఐదు, బ్రాంకియల్ యాంజియోగ్రామ్ మూడు సేవలు అందించినట్లు ఆయన తెలిపారు.

**నిశ్చింతగా రండి : సీతారామ్, గుండె వైద్య నిపుణులు**



ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె జబ్బులకు సంబంధించి అధునీక పద్దతుల్లో చికిత్సలు అందిస్తున్నామని గుండె జబ్బు బాధితులు నిశ్చింతగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రావచ్చునని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. పైసా ఖర్చు లేకుండా వైద్యం అందించడం జరుగుతుందని సీతారామ్ తెలిపారు. ప్రతి రోజు గుండెకు సంబంధించిన 70 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారని ప్రతి రోజు 60 మందికి టూడి ఈకో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# గ్రామస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్**






**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో వైరా మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దాచాపురం, గరికపాడు గ్రామాల్లో జరిగిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిధిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈస ందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంపై జరిగిన సమావేశాల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ నాయకులకు పార్టీ నిర్మాణంపై పలు సూచనలు పార్టీ నిర్మాణంలో ప్రతి కార్యకర్త పనిచేయాలని ఇప్పుడు పార్టీ నిర్మాణంలో గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయిలో గ్రామశాఖ అధ్యక్షులు నియమించే ప్రక్రియలో భాగంగాప్రతి ఒక్క గ్రామ శాఖ అధ్యక్షుడు ఆ గ్రామం నుంచి పార్టీ బలోపేతానికి అక్కడినుంచి అక్కడున్న గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారం దిశగా పనిచేసే పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలను పార్టీకి దగ్గర చేయాలని గ్రామ శాఖ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు టిపిసిసి కార్యదర్శి నూతి సత్యనారాయణ, మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ వైరా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిడికె.రత్నం, మట్టూరి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జి, పొట్టపల్లి శ్రీను, మూడుముంతల గంగరాజు యాదవ్, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, శ్రీరామనేని తిరుపతిరావు, పాలేటి నర్సింహారావు, పెద్దప్రోలు లక్ష్మ య్య, గ్రామ కాంగ్రెస్ నాయకులు శీలం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించండి

**- ఈ ఏడాది నుండి నవోదయ విద్యాలయం ప్రారంభం**
**- బడిబాట కార్యక్రమంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల వసులున్నాయని, పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కరకగూడెం ప్రభుత్వ ఉన్నతపాఠశాల్లో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, అనవసరంగా విద్యను ఖర్చు చేసి చదువును కొనుక్కోవద్దన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఆగ్లవిద్యాబోధన, ఉచిత వైద్యపరీక్షలు, మంచి విద్యార్హత గల ఉపాధ్యాయులతో బోధనతోపాటు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యా సం. నుండి కరకగూడెంలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రారంభోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయని, వేర్వేరు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొందుతారని, వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య అందుబాటులోనికి రావడం మన అదృష్టం అన్నారు. అనంతరం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. జూన్ 12 నాటికి అన్ని రకాల పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాఐరు. ఈ కార్యక్రమంలో డిఇఓ వెంకటేశ్వరాచారి, కరకగూడెం తహశిల్దార్, జిల్లా అకాడమిక్ కో ఆర్డినేటర్ నాగరాజు శేఖర్, కరకగూడెం ఎంఇఓ మంజుల, ఇంజనీరింగ్ డిఇ, ఏఇ, మండలసమాఖ్య సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

**- ఐటిడిఏ పిఓ**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం ఆశా డే సందర్భంగా ఆయన చర్ల పిహెచ్‌సిలో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పిఓ మాట్లాడుతూ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేయాలని, గర్భిణీలకు చక్కటి సేవలు అందించాలన్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెలలు నుండిన గర్భిణీలను గుర్తించి వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించాలని, పొరపాటున కూడా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో, పట్టణాల్లో పరిసరాల పరిశుభ్రతపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, దోమల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విష జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పిహెచ్‌సిలోని రికార్డును పరిశీలించిన ఆయన రిజిష్టర్ల నిర్వహణ క్రమంతప్పకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ డిఎంహెచ్ఓ డా. చైతన్య, డాక్టర్లు హారిక, స్పందన, సచిన్, సూపర్వైజర్లు ప్రసాద్, దుర్గ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పొంగులేటి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయం ను అందించారు. మండలం లోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగారం, మంగాపురం,భైరవుని పల్లి, రాయగూడెం, బుద్దారం, చెరువుమాధారం, బోదులబండ, సుర్దేపల్లి, రాజేశ్వరపురం, నేలకొండపల్లి గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున 15 బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు మాట్లాడారు. మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, కుక్కల హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న యరబోయిన నర్సయ్య, మామిడి సుభద్రా, డి.సత్యనారాయణ, చిట్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తల్లంపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రికి మర్యదపూర్వకంగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి అంబేద్కర్, సోమనబోయిన సత్యనారాయణ, లింగయ్య, భారీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నమోదు పెంచాలి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేయాలని రఘునాథపాలెం మండల విద్యాశాఖాధికారి రాములు తెలిపారు. ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకేటేశ్వర్లు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసభలో ఎంఈవో రాములు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులు, విద్యా విధానం గురించి తల్లిదండ్రుల గురించి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల నమోదును పెంచేందుకు గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ జ్యోతి, ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ రాధారుక్మిణి, ఏఏపిసి ఛైర్మెన్లు, సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

## హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఐటిసి పిఎస్‌పిడి అతిధి గృహంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇక్కడి వచ్చిన ఆయనను కలుసుకున్న కలెక్టర్ పూలమొక్కను ఆందించి ఆహ్వానం పలికారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం:** ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మంగ్రాజుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొర్తి గురవయ్య సూచించారు. మండలం లోని మంగ్రాజుపల్లిలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహం తో ఉన్నత చదవులు చదవాలని ఆకాంక్షించారు. ఉచితంగా దుస్తులు, పుస్తకాలతో పాటు మధ్యాహ్నం భోజనం ను అందిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందని అన్నారు. ప్రవేట్ వద్దు... ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదంతో ప్రతీ ఒక్కరూ పాఠశాలలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగులుమీరా, అంగన్వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్‌స్ట్రోక్ బాధితురాలికి సీపీఐ చేయూత

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల పరిధిలోని 21ఏరియాలో బియ్యాని రమేశ్ భార్య లావణ్యకు బ్రెయిన్‌స్ట్రోక్ గురి అయిన నేపథ్యంలో వైద్యచికిత్సకై సీపీఐ ఆధ్వర్యంలో రూ.12వేలు ఆర్థిక సాయం చేసి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

## కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సొంత ఇల్లు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్ హాయంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాయమాటలతో పబ్బం గడిపిందని అన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్. శివ, కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, కుక్కల హనుమంతరావు, మోర మలయ్య కడియాల నరేష్,మోర మల్లయ్య, సుభాన్, ఐతనబోయిన శ్రీను, కొండబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ పట్టివేత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్న సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా రేషన్ బియ్యం తరలుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు మండల వ్యాప్తంగా మధిర రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండల పరిధిలోని మాటూరు గ్రామంలో ఒక ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5.8 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత నిందితులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మధిర పట్టణం బంజారాకాలనీ 8 వార్డులో నివాసముంటున్న మేకల వెంకటేష్ భార్య సీత(38) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పొట్ట కూటి కోసం చిత్తు కాగితాలు వేరుకుని జీవనం సాగిస్తున్న క్రమంలో శుక్రవారం ఇల్లెందు వెళ్లగా అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల సీత మృతి చెందగా మిగిలినవారికి తీవ్ర గాయాలు అవడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో మేకల సీత కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## నాయుడుపేటలో బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండలంలోని ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని నాయుడుపేటలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యి, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేపించారు. అలాగే ఆరెకోడు అంగన్వాడీకేంద్రం ఆధ్వర్యంలో సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజల హృదయాల్లో

# చెరగని ముద్ర వేసుకున్న మదన్‌లాల్

-మదన్‌లాల్ సేవలు మరువలేనివి
-వైరాలో మదన్‌లాల్ సంతాప సభ
-పాల్గొన్న కొండబాల, కూరాకుల నాగభూషణం
-కంటతడి పెట్టిన నాయకులు
-మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ









**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ అకాల మరణం పట్ల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన వైరా రింగు రోడ్డు సెంటర్ ఇండోర్ స్టేడియం ఆవరణలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత ఖమ్మం డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రాజకీయాల పట్ల ఆకర్షితుడై ఎంపిటిసి నుంచి సర్పంచ్‌గా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజల్లో అనునిత్యం ప్రతిపక్షం గాని అధికారపక్షం గాని తనదైన శైలిలో పనిచేశారని వైరా నియోజకవర్గంలో అభివృద్ధి అంటేనే మదన్‌లాల్ అని గుర్తు చేశారన్నారు. మరణం తర్వాత కూడా ఆయన సంతాప సభలను వైరా నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించడం అభిమానుల అభిమానిని, అభిమానులను సంపాదించుకోవడం కూడా చాలా అరుదని అన్నారు. వైరా నియోజకవర్గంలో అలాంటి నాయకుడు పుట్టడం అరరుదని కొండబాల అన్నారు. సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ బానోతు మదన్‌లాల్ మరణం తీరని లోటు, పార్టీ ఏదైనా ఎవరు వెళ్లిన ఎలాంటి పని అయినా చేశాడని గుర్తు చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓ మంచి నాయకుడిని కోల్పోయామని పని అంటే ఏమిటి ఎవరు ఏమి అని అడగకుండా ఆ పనిచేసిన నాయకుడు మదన్ అని ఆయన అన్నారు. అనంతరం వివిధపార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ చివరి ప్రాణం పోయే వరకు కూడా నియోజకవర్గ ప్రజల కోసం పనిచేశాడని ఆయన మరణం ఈ విధంగా వస్తుందని ఎవరు ఊహించలేదని అన్నారు. మంచితనానికి మారుపేరు మదన్‌లాల్ అని గుర్తు చేశారు. బొంతు సమతతో పాటు పలువురు మాట్లాడుతూ కంట తడి పెట్టారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీ నాయకులు సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం, వైరా మాజీ ఎంపిపిలు కట్టా కృష్ణార్జున్‌రావు, బొంతు సమత, వైరా మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కిలారి కిరణ్, గుమ్మా రోశయ్య, కామినేని శ్రీనివాసరావు, మాదినేని దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్లు మాదినేని సునీత, దారెల్లి పవిత్రకుమారి, తడికమళ్ళ నాగేశ్వరరావు, పాముల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి తన్నీరు జ్యోతి, మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, వైరా పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, బట్టా భద్రయ్య, తన్నీరు నాగేశ్వరరావు, వజినేపల్లి చక్రవర్తి, చింత నిప్పు మురళి, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, షేక్ పాషా, నూకల ప్రసాద్, కారుకొండ బోస్, పారుపల్లి నాగం, గుజ్జర్లపూడి దేవరాజ్, ఆదూరి ప్రేమ్, విలాసాగరం నరేష్, విలాసాగరం వెంకటేశ్వరరావు, వీరబాబు, మోటపోతుల సురేష్, తన్నీరు కిషోర్, రంగా సత్యనారాయణ, నల్లగొండ నాని, మడిపల్లి కృష్ణ, పుప్పాల అనంతరామయ్య, అయినాల కనకరత్నం, దొంతబోయిన వెంకటనారాయణ, ఓంకార్ యాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గంధం అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మున్సిపాల్ కమీషనర్ వేణు పర్యటించారు. డ్రైనేజీ కాల్వలు అస్తవ్యస్థంగా ఉండటంతో స్థానికులు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే మున్సిపాల్ కమీషనర్‌తో కలిసి గంధం టవర్స్ ప్రాంతాల్లో డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్య అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితి చూసి డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపాల్ కమీషనర్ వేణును మున్సిపాలిటీ ఇంజనీరింగ్ సిబ్బందిని కోరారు. మున్సిపాలిటీలో ఉన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సర కాలంగా గంధం టవర్స్ ఎదురుగా ప్రధాన రహదారిపై నుండి మురుగునీరు ప్రవహించడం వలన ప్రధాన రహదారిపై వెళుతున్న ప్రయాణీకులకు మురుగునీరు దుర్వాసనతో ఇబ్బందులు గురవుతున్నారని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొత్త డ్రైనేజీ నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాల్ మాజీ చైర్మన్ జైపాల్, పమ్మి అశోక్, చెరుకూరి చలపతి, ఫణితి శ్రీను, మద్దినేని రామారావు, మున్సిపాలిటీ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బూడిదంపాడు గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టం వల్ల ప్రజలు, రైతులు భూ సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చి భూ సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. బూడిదంపాడు గ్రామంలో నిర్వహించన సభలో తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు. 62 మంది దరఖాస్తులు అందజేశారు. కోటపాడులో జరిగిన సదస్సులో 66 దరఖాస్తులు రాగా డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్‌రావు, ఆర్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ఖమ్మం నగర పరిధిలోని బల్లేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సైదులు, ఆర్ఐ సాయి నరేష్, కార్పొరేటర్ లకావత్ సైదులు పాల్గొన్నారు. భూ సమస్యలకు సంబంధించి 13 మంది దరఖాస్తు చేశారు.

## 14న సిపిఐ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు ఈనెల 14న మధిరలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 19, 20 తేదీల్లో సిపిఐ మహాసభలు మధిరలో జరగనున్న నేపథ్యంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆహ్వాన సంఘ సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తో పాటు మధిర పట్టణంలోని ప్రముఖులు, పార్టీ బాధ్యులు హాజరుకానున్నట్లు రవికుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**-పలువురికి గాయాలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన కొణిజర్లలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం ఉదయం ఖమ్మం వైపు నుంచి వస్తున్న స్కూటి వాహనాన్ని ఖమ్మం వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వెనక నుంచి ఢీకొనగా ద్విచక్ర వాహనంపై ఉన్న ఏదులాపురంకు చెందిన వెల్పుల వెంకన్న (50) తలకు బలమైన గాయాలయ్యాయి. 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. వెంకన్న భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

**ఆర్టీసి బస్సు టిప్పర్ ఢీ :**

వైరా నుంచి ఖమ్మం వస్తున్న మణుగూరు డిపో ఆర్టిసి బస్సు ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొనగా బస్సు అద్దాలు పగిలి బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసలు కేసు నమోదు చేసిదర్యాప్తు చేపట్టారు.

**ఆర్టిసి బస్సు క్రేన్ ఢీ :**

ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టిసి లహరి బస్సును కొణిజర్ల సెంటర్‌లో జేసిబి క్రేన్ డ్రైవర్ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా ఒక్కసారిగా ముందుకు రావడంతో క్రేన్ ముందు భాగం బస్సుకు తగిలి బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. క్రేన్ ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోవడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో క్రేన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## భూభారతి రెవెన్యూ సదస్సు పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడులో నిర్వహిస్తున్న భూభారతి రెవిన్యూ సదస్సును ఆర్డీఓ నర్సింహారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ రైతు వద్ద నుంచి స్వయంగా ధరఖాస్తును స్వీకరించారు. అనంతరం రైతుల సమస్యలను అధికారులు ఏ విధంగా పొందు పరుచుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి భూభారతిలో ఉన్న సౌలభ్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి సమస్య లేకుండా ఫిర్యాదులను స్వీకరించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ రవిందర్, ఆర్ఐ ప్రసాద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మదన్‌లాల్ పేరు చెబుతూ కంటతడి పెట్టిన మాజీ ఎంపిపి బొంతు సమత

**ఎక్కడ ఎక్కడ నెగ్గాలో ఎక్కడ తగ్గాలో తెలిసిన నాయకుడు మదన్‌లాల్**




**ప్రజాపక్షం/వైరా:** వైరాలో రింగు రోడ్డు వద్ద జరిగిన మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ సంతాప సభలో పాల్గొన్న మాజీ ఎంపిపి బొంతు సమత సంతాప సభలో మాట్లాడుతూ మదన్‌లాల్ మరణించడం అంటూనే బోరున ఏడ్చారు. కంటిలో నీరు ఆపుకోలేక బాధతోనే మాట్లాడుతూ కంటిలో నీరు ఆపుకోలేక బాధతోనే మాట్లాడుతూ తాను ఎంపిపిగా ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా తమకు అండగా నిలిచాడని ఒక మంచి సోదరుని నేను కోల్పోయాను అని అన్నారు. ప్రతి రక్షాబంధన్‌కు రాఖీ కట్టానని అలాంటి మదన్‌లాల్ మరణం మమ్ముల్ని ఎంతో కుమిలిపోయేలా చేసిందన్నారు. మండల అభివృద్ధిలో అన్ని విధాల సహకరించారు. ఎక్కడ తగ్గాలో ఎక్కడ తగ్గారు ఎక్కడ నెగ్గాలో అక్కడ నెగ్గాడు. ఏ మూలన నియోజకవర్గంలోకి వెళ్లిన ప్రతి గ్రామంలో పేరుపేరునా పెట్టి పిలిచే గొప్ప నాయకుడు మదన్‌లాల్ అని అలాంటి మదన్‌లాల్ సంతాప సభలో పాల్గొనడం నాకు చాలా బాధాకరమైన తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.

## ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆదివారం కల్లూరులో మధిర రోడ్డులోని డిఎన్‌పి ఫంక్షన్ హాల్ నందు నూతన అధ్యక్షులుగా పసుమర్తి సీతాచంద్రరావు ప్రమాణస్వీకారం చేస్తారని, ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో జరిగే ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ ఉపాధ్యక్షులు గ్రంధి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కల్లూరులో జరిగే నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా, జిల్లా నాయకులు రాష్టనాయకులు మరి కొంతమంది ముఖ్య అతిధులు కార్యక్రమానికి హాజరవుతున్నారని అన్నారు. ఈ మహాసభలో ఖమ్మం జిల్లాలోని ఆర్యవైశ్య సోదరీసోదరీమణులు అందరూ పాల్గొని ఆర్యవైశ్యుల యొక్క ఐక్యతను చాటాలని రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యులు రాజకీయాల్లోను సేవారంగాల్లోను తమ యొక్క ప్రత్యేకతను చాటాలని ప్రవీణ్ కుమార్ తెలిపారు.